# ఎంజీయూ వీసీగా ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

- నేడు లేదా ఎల్లుండి వర్సిటీకి వచ్చే అవకాశం
- గతంలో ఇక్కడ వీసీ పని చేసిన అనుభవం



ఖాజా అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, అక్టోబర్ 18 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌ను ప్రభుత్వం నియమించింది. కాకతీయ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్‌లో ప్రొఫెసర్‌గా పని చేసిన ఆయన 2016 జూలై 2 నుంచి 2019 జూన్ 29వరకు ఎంజీయూలో వీసీగా పని చేశారు. ఎంజీయూకు న్యాక్ హోదాతో పాటు నూతన సంస్కరణలు తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయన తిరిగి రెండోసారి ఎంజీయూకు వీసీగా రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్ నుంచి హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన వీసీ శనివారం సాయంత్రం లేదా సోమవారం ఉదయం ఎంజీయూకు వచ్చే అవకాశం ఉంది.


నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శనివారం 19 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI




బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి వర్క్‌షాప్‌లో దిశానిర్దేశం చేస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# ప్రభుత్వంపై ఉద్యోగుల ఫైర్



- సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేదని ఆవేదన
- డీఏలు లేవు... ఫిట్‌మెంట్ లేదు
- సీపీఎస్ రద్దు ఊసే ఎత్తని ప్రభుత్వ పెద్దలు
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కూ ఎదురుచూపులు
- దసరా పోయింది... దీపావళికైనా ఇస్తారో, లేదోనన్న ఆందోళన
- కేసీఆర్ పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పోలుస్తూ ఆసక్తికర చర్చ
- కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటానికి సన్నద్ధం

## మాటలతో కాలయాపనకే సర్కారు ప్రాధాన్యం


ఎన్నికల్లో అధికారం కోసం ఇచ్చిన హామీలకు పాతరేస్తూ కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు భగ్గుమంటున్నారు. గద్దె నెక్కడానికి ఎన్నికలకు ముందు ఇష్టానుసారంగా హామీల వర్షం కురిపించిన నాటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్నీ మర్చిపోయాడని మండిపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణం చెల్లిస్తామని, కొత్త పీఆర్సీ ప్రకటించి ఆరు నెలల్లో సిఫారసులను అమలు చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అంతేగాక అనేక రకాల హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఒక్కటి కూడా అమలు చేయకపోవడంపై ఉద్యోగులు సీరియస్‌గా ఉన్నారు. గతంలో కేసీఆర్ అధికారం చేపట్టిన వెంటనే ఉద్యోగులకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఫ్రెండ్లీ గవర్నమెంట్ పేరుతో దేశంలో ఎక్కడా లేనివిధంగా రెండు విడుతల్లో 73 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ఘనత కేసీఆర్‌దేనని చర్చించుకుంటున్నారు. నాటి కేసీఆర్ సర్కార్‌కు, నేటి కాంగ్రెస్ పాలనకు బేరీజు వేసుకుంటున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ)



### తీవ్ర నిర్లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్

ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల ఓట్ల ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అనేక హామీలు గుప్పించింది. ఏకంగా మేనిఫెస్టోలో అనేక హామీలను పొందుపర్చింది. బీఆర్ఎస్ సర్కారు కంటే గొప్పగా ఉద్యోగుల సంక్షేమంపై శ్రద్ధ చూపుతామని మాయ మాటలు చెప్పింది. కానీ ఏ ఒక్కటీ అమలు నోచలేదు. కనీసం ఉద్యోగ సంఘాలతో చర్చించి హామీలను అమలు చేసే సమయాలు కూడా చెప్పడం లేదు. ఎన్నికల ముందు మాట్లాడిన తీరుకు ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు అసలు పొంతన లేదని ఉద్యోగులు, ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించడమే గాక ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను అధికారం చేపట్టిన వెంటనే చెల్లిస్తామని హామీనిచ్చింది. నేటికి పది నెలలు గడుస్తున్నా వాటి ఊసే లేకపోవడం గమనార్హం. పెండింగ్ డీఏల సంఖ్య కాస్తా మూడు నుంచి ఐదుకు పెరిగినా ప్రభుత్వం నోరు మెదపడం లేదు. మూడు డీఏలను దసరా పండుగకు క్లియర్ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం వచ్చినా ఆచరణకు నోచలేదు. దాంతో దసరా పండుగ పూట ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. దీపావళికి ఇస్తామన్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇస్తున్నా... దీనిపైనా అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తీరు చూస్తుంటే దీపావళికి కూడా పెండింగ్ డీఏలు క్లియర్ చేస్తారన్న నమ్మకం కలుగడం లేదని ఉద్యోగ సంఘాల నేతలే సందేహాలు వెలిబుచ్చుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చే డీఏలను సకాలంలో ప్రకటించి, బకాయిలను నేరుగా ఉద్యోగులకు చెల్లిస్తామని కూడా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. దీనికితోడు ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి, ఆరు నెలల్లో సిఫార్సులు అమలు చేస్తామని గొప్పలకు పోయింది. దీనిపైనా స్పష్టత కరువైంది. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్న డిమాండ్‌కూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒకే చెప్తూ అధికారంలోకి రాగానే చేస్తామని హామీనిచ్చింది. కానీ నేటికి సీపీఎస్ విధానం రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై కార్యాచరణేదీ కనిపించడం లేదు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో అన్ని రకాల జబ్బులకు అన్ని ఆస్పత్రుల్లో వైద్యం అందించే విధంగా హెల్త్ కార్డులు జారీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. ఇలా ఏడాది కిందట అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను తన వైపు తిప్పుకొనే ప్రయత్నం చేసింది. రిటైర్ అవుతున్న ఉద్యోగస్తులకు రావాల్సిన బెనిఫిట్స్ కూడా చెల్లించలేని దుస్థితి దాపురించింది. ప్రధానంగా రాష్ట్రంలో గత మార్చి నుంచి ప్రతినెలా సుమారు వెయ్యి మంది వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు రిటైర్ అవుతున్నారు. వీరికి రిటైర్మెంట్ సమయంలో రావాల్సిన బెనిఫిట్స్‌కు అతీగతీ లేకపోవడం విచారకరం. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకుని ఆరు నెలలు దాటుతున్నా గత మార్చి నుంచి నేటి వరకు పదవీ విరమణ పొందుతున్న ఏ ఒక్కరూ బెనిఫిట్స్ అందక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇటువంటి అనేక అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంప్లాయీస్ పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షన్‌దారులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దఫదఫాలుగా తమ సమస్యల పరిష్కారం కోసం సర్కారుపై సమరానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంప్లాయిస్‌లో ఆసక్తికర చర్చ కూడా సాగుతున్నది. గత బీఆర్ఎస్ సర్కార్ తీరుకు, నేటి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారశైలిని భేరీజు వేసుకుంటూ కేసీఆర్ పాలనకే మార్కులు వేస్తున్నారు.



### కేసీఆర్ సర్కార్ హయాంలో ఎన్నో..

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, కొత్త రాష్ట్రంలో సంక్షేమాన్ని పరుగులు పెట్టించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అందులో భాగస్వాములైన అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. ఉద్యమంలో తమ వంతు కీలక పాత్ర పోషించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమం విషయంలో తీసుకున్న అనేక అంశాలే ఇందుకు సాక్షాలుగా నిలిచాయి. ప్రభుత్వ పగ్గాలు చేపట్టగానే 2014లోనే బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన ఇంక్రిమెంట్ పూర్తి కాలం అమలయ్యేలా చేశారు. 2014 పీఆర్సీలో భాగంగా వేతన స్కేళ్లను సవరించిన ప్రభుత్వం ఉద్యోగుల అంచనాలకు భిన్నంగా 43శాతం ప్రకటించి ఉద్యోగులపై తనకున్న ప్రేమను చాటుకున్నది. 43శాతం ఫిట్‌మెంట్ అనేది చారిత్రాత్మక నిర్ణయం. ఇక్కడితో ఆ ప్రస్థానం ఆగలేదు. 2018 పీఆర్సీకి సంబంధించిన నివేదికను 2020 డిసెంబర్ 31న ఆనాటి కమిటీ చైర్మన్ విశాల్ ప్రభుత్వానికి సమర్పించారు. ఏడు శాతం ఫిట్‌మెంట్ పెంచడానికి కమిటీ సిఫారసు చేయగా, ఆ నివేదికను పక్కన పెట్టి అసెంబ్లీ సాక్షిగా 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి కేసీఆర్ ఆనాడే ఉద్యోగులపై మరోసారి తన ప్రేమను చాటుకున్నారు. స్వరాష్ట్రంలో రెండు పీఆర్సీల ద్వారా 73 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కింది. దేశంలోని బీజేపీ, కాంగ్రెస్ పాలిత ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో ఫిట్‌మెంట్ పెంచిన దాఖలాలు లేవు. నిజానికి సమైక్య రాష్ట్రంలో వైఎస్సార్ హయాంలో 16 శాతం, చంద్రబాబు హయంలో 25 శాతం మాత్రమే ఆనాటి ప్రభుత్వాలు ప్రకటించాయి. కేసీఆర్ మాత్రం వాటికి భిన్నంగా ఎవరూ ఊహించని ఫిట్‌మెంట్ ప్రకటించి ఉద్యోగుల పెన్నిధిగా నిలిచారు. చివరగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ చైర్మన్‌గా పీఆర్సీ కమిటీని నియమిస్తూ ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ నెంబర్ 159ను జారీ చేసింది. నివేదికను ఆరు నెలల లోపు ఇవ్వాలని నిర్దిష్ట గడువు పెట్టడంతోపాటు తక్షణమే ఐదు శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఈ క్రమంలోనే ఎన్నికలు, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అది పెండింగ్‌లో పడిపోయింది. ఫిట్‌మెంట్ ఒక్కటే కాదూ... 2014కు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల గ్రాటిట్యూటీ రూ.8లక్షలు ఉంటే దాన్ని 2014లో రూ.12 లక్షలకు, తర్వాత 2018 పీఆర్సీలో రూ.16లక్షలకు పెంచడంతో కేసీఆర్ సర్కార్ హయాంలో గ్రాటిట్యూటీ ఏకంగా డబుల్ అయ్యింది. ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోరిక మేరకు రాష్ట్రంలో ఏదైనా ఒక కేటగిరీలో పదోన్నతి పొందాలంటే మూడేండ్ల సీనియార్టీ అవసరం ఉండగా, ఆ పరిమితిని రెండేళ్లకు తగ్గిస్తూ 2021 ఆగస్టు 30న జీఓ నెంబర్ 259ను జారీ చేశారు. స్పౌజ్ కేటగిరీలో భార్యాభర్తలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. కారుణ్య నియామకాలు, రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఉద్యోగులను తెలంగాణకు రప్పించడం బాధ్యతగా తీసుకున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారా ఏర్పడిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, కోర్టులతో వేలాది మందికి పదోన్నతులు లభించాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 15 శాతం అదనపు పెన్షన్ కోసం వయోపరిమితిని 75 ఏండ్ల నుంచి 70 ఏండ్లకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 58 నుంచి 61 పెంచి 2021 మార్చి నుంచి అమల్లోకి తెచ్చారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల వైద్య పరీక్షలకు గరిష్ట పరిమితి ఎత్తివేశారు. ప్రభుత్వంలో టీఎస్ఆర్టీసీని విలీనం చేయడం ద్వారా 43వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చారు. ట్రావెలింగ్ కన్వినియన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 30 శాతం పెంచారు. బిడ్డ పెండ్లికి అడ్వాన్స్‌ను రూ.4లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇల్లు కట్టుకోవాలని అడ్వాన్స్ పెంపు, బదిలీపై వెళ్లే ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ 30 శాతం, షెడ్యూల్ ఏరియాలో పని చేసేవాళ్లకు 30శాతం అలవెన్స్‌ను ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం పెంచింది. మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇలా అనేక అంశాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమానికి కేసీఆర్ సర్కార్ పెద్ద పీట వేసింది. ప్రస్తుతం రేవంత్ సర్కార్ తీరుతో గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసినవన్నీ మరోసారి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు బేరీజు వేసుకుంటూ చర్చించుకుంటున్నాయి.

# నిత్యం ప్రజల్లో ఉండాలి సమస్యలపై పోరాడాలి

## పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### కేసీఆర్ తెచ్చిన పథకాలను బంద్ పెట్టి జనం నోట్లో మట్టి

- సంపద దోచుకుంటాం.. అభివృద్ధిని అటకెక్కిస్తామంటే ఊరుకునేది లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిశానిర్దేశం
- బీఆర్ఎస్ సూర్యాపేట, ఆత్మకూర్.ఎస్ మండలాల నేతలతో వర్క్‌షాప్

సూర్యాపేట, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉండాలని, సమస్యలపై ప్రజాల పక్షాన పోరాడాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ సూర్యాపేట నియోజకవర్గస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. మండలాల వారీగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌కు తొలి రోజు సూర్యాపేట టౌన్, రూరల్, ఆత్మకూర్.ఎస్ మండలాల ముఖ్య నేతలు హాజరు కాగా, గుంటకండ్ల వారికి దిశా నిర్ధేశం చేశారు. మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను తుంగలో తొక్కి, ఇదేంటని ప్రశ్నిస్తే అణిచివేతతో పాలించాలని చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు పాలన వదిలి స్కాముల్లో పోటీలు పడుతున్నారని ఆరోపించారు. పదేండ్లుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ వచ్చారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని బంద్ పెట్టి జనం నోట్లో మట్టి గొడుతున్నదన్నారు. అరాచకాలు సృష్టిస్తాం.. ప్రశ్నిస్తే కేసులు పెడుతామని బెదిరిస్తున్న తీరుతో ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. పలు సమస్యలపై తెలంగాణ భవన్‌కు నిత్యం ప్రజలు బారులు తీరుతున్నారని, కాంగ్రెస్ అరాచకాలు తట్టుకోలేక మహిళలు సైతం బయటకు వచ్చి పోరాడుతామంటున్నారని తెలిపారు. ఆపద సమయంలో బీఆర్ఎస్ శ్రేణు లు ప్రజలకు అండగా నిలువాలన్నారు. మనం చేసిన అభివృద్ధి ఆగం చేస్తుంటే చూస్తూ ఊరుకుందామా అని ప్రశ్నించారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ పుట్టిం దే తెలంగాణ అభివృద్ధి కోసమని, సంపద దోచుకుంటాం.. అభివృద్ధిని అటకెక్కిస్తామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాడడం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# ఎయిమ్స్ అస్తవ్యస్తం

## ప్రఖ్యాత సంస్థలో పర్యవేక్షణ లోపం

- నామ్‌కే వాస్తేగా సీసీ కెమెరాలు
- సెక్యూరిటీ కూడా అంతంతే..
- సాయంత్రం ఐదు దాటితే బాధ్యులెవరూ ఉండరు
- ఆ తర్వాత చికిత్స అంతా వైద్య విద్యార్థులతోనే..
- రాసలీలల వీడియో వైరల్‌తో పేషెంట్ల ఆందోళన
- పటిష్ట నిఘా, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) అత్యంత ప్రఖ్యాత సంస్థ. జిల్లాలోని బీబీనగర్ ఎయిమ్స్ మాత్రం అస్తవ్యస్తంగా తయారైంది. హాస్పిటల్‌లో ఏం జరుగుతుందో కూడా పట్టించుకునే కరువయ్యాయి. కనీసం సీసీ కెమెరాలు కూడా పూర్తిస్థాయిలో లేవు. సెక్యూరిటీ కూడా అంతంత మాత్రమే. తాజాగా ఎయిమ్స్‌లో వెలుగుచూసిన రాసలీలల బాగోతం వీడియో వైరల్ అవడంతో పేషెంట్లు ఆందోళన చెందుతున్నారు.

బీబీనగర్‌లో ఉన్న నిమ్స్ స్థానంలో 2019–20 విద్యా సంవత్సరంలో ఎయిమ్స్ వైద్య విద్య తరగతులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లలో విద్యార్థులు చేరారు. 2020 జూన్ 2 ఇక్కడ నుంచి అవుట్ పేషంట్ సేవలు ప్రారంభించారు. ప్రస్తుతం 33 విభాగాల్లో సేవలు అందుతున్నాయి. ఓపీ ఫీజు 10 రూపాయలు అవడంతో జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆస్పత్రి నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంది.

### కనీస పర్యవేక్షణ కరువు..

ఎయిమ్స్ నిర్వహణపై పట్టింపు లేన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. కనీసం పర్యవేక్షణ కరువైంది. సాయంత్రం ఐదు గంటలు దాటితే డాక్టర్లంతా ఇంటి బాట పడుతారు. ఆ తర్వాత వైద్య విద్యార్థులు, సెక్యూరిటీ తప్ప పాలనా పరమైన విభాగాలకు సంబంధించిన వారెవరూ ఉండడం లేదు. అధికారులు, డాక్టర్లు హైదరాబాద్ నుంచి వచ్చి వెళ్తుండడంతో ఇక్కడి మంచీచెడులను పట్టించుకునే వారు కరువయ్యారు. సాయంత్రం తర్వాత ఇన్ పేషెంట్ సేవలను వైద్య విద్యార్థులే అందిస్తున్నారు. ఎమర్జెన్సీ సేవల అడ్మిట్ లేకపోవడంతో చికిత్సను స్టూడెంట్స్‌కు అప్పగించి వైద్య ప్రమాణాలను గాలికొదిలేస్తున్న పరిస్థితి. చీకటి పడిందంటే చాలు ఎవరు వస్తుంటారో, ఎవరు పోతుంటారో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఎయిమ్స్ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను ఎవరినీ పరిగణలోకి తీసుకోవడం లేదు. కనీసం ప్రొటోకాల్ కూడా పట్టించుకోరు. ఇలా ఇక్కడ ఆడింటే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా తయారైంది.

### నామమాత్రంగానే సీసీ కెమెరాలు..

టెక్నాలజీ యుగంలో అంతటా సాంకేతికను సద్వినియోగం చేసుకుంటున్నారు. చిన్నపాటి కిరాణ దుకాణాల్లోనూ మంచిగా సీసీ కెమెరాలు అమర్చుకుంటున్నారు. అలాంటిది దేశంలో ప్రముఖ సంస్థ అయిన ఎయిమ్స్‌లో మాత్రం పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు లేవు. కేవలం మెయిన్స్ ఎంట్రెన్స్, ఓపీ కౌంటర్ దగ్గర మాత్రమే ఏర్పాటు చేశారు. లోపల వందల రూమ్‌లు ఉన్నా ఎక్కడా సరిపడా సీసీ కెమెరాలు లేవు. మరోవైపు ఎయిమ్స్‌లో సెక్యూరిటీ వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉంది. స్టాఫ్ రిక్రూట్‌మెంట్‌లో అవినీతీ ఆరోపణలు రావడంతో సెక్యూరిటీ సిబ్బంది భర్తీ నిలిచిపోయింది. అవసరం ఉన్న మేరకు నియమించకపోవడంతో సరిపడా సెక్యూరిటీ గార్డులు లేరు. సిబ్బంది సైతం దురుసుగా వ్యవహరిస్తారనే ఆరోపణలున్నాయి. తాజాగా ఆస్పత్రిలో రాసలీల వీడియో వైరల్ కావడంతో పేషెంట్లు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎయిమ్స్‌పై ఉన్న నమ్మకంతో వివిధ రకాల చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్నామని, బహిరంగంగా ఇలాంటి ఘటనలకు పాల్పడడం ఏంటని మండిపడుతున్నారు. ఎయిమ్స్ పేరు ప్రతిష్ఠలను చెడగొట్టకుండా అధికారులు పటిష్ట నిఘా, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కే, జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్

# గ్రూప్స్‌కు 15 సెంటర్లు

- పరీక్షల నిర్వహణకు సన్నద్ధం
- హాజరుకానున్న అభ్యర్థులు 6,216మంది
- కలెక్టర్ హనుమంతు కే జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 18 : గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హనుమంతు కే జెండగే తెలిపారు. శుక్రవారం టీజీఎస్పీ చైర్మన్ మహేందర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో 6,216 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానుండగా, మొత్తం 15 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా పోలీస్, రెవెన్యూ అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి నిర్వహణకు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.

# నకిరేకల్‌లో అరాచక పాలన

## కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న పోలీసులు

- బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు.. పైపెచ్చు ఉల్టా కేసులు
- ఆరు మండలాల పరిధిలో 9 నెలల్లోనే వేల కేసులు
- ఎస్పీ చొరవ తీసుకొని అన్ని కేసులను పరిశీలించాలి
- దమనకాండ ఆపకపోతే ఆందోళనకు సిద్ధం
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- పోలీసులు కుట్రలు మాని ప్రజల్లో విశ్వాసాన్ని పొందాలి : బండ



నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 18 : కాంగ్రెస్ పాలనలో నకిరేకల్ నియోజకవర్గంలో పోలీసులు దమనకాండ సాగిస్తున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ శ్రేణులపై తప్పుడు కేసులతో అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై వేలాది తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని వాపోయారు. ప్రధానంగా నకిరేకల్ సీఐ రాజశేఖర్, కేతేపల్లి, కట్టంగూర్ ఎస్ఐలు కాంగ్రెస్ కార్యకర్తల్లా ప్రవరిస్తూ బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు చేసిన వాళ్లను వదిలిపెట్టి దెబ్బలు తిన్న తమ కార్యకర్తలపైనే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇండ్లు కూల్చుతుంటే, నకిరేకల్‌లో తొమ్మిది నెలల కాలంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయని ఎమ్మెల్యే అన్ని మండలాల్లో దౌర్జన్యాలు, దందాలు, అక్రమ కేసులు, దాడులు చేయిస్తూ రాక్షసానందం పొందుతున్నాడని ఆరోపించారు. పోలీసులు ఆయనకు లెఫ్ట్, రైట్ అనుకుంటూ చేస్తున్న అక్రమాలతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

### తొమ్మిది నెలల్లో వేల కేసుల బనాయింపు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండ్రోజులకే కేతేపల్లి మండలం చెర్కుపల్లికి చెందిన సైదులును చెట్టుకు కట్టేసి కొడితే తిప్పర్తి పోలీసులు వచ్చి విడిచి పెట్టిన ఘటనలోనూ నిందితులపై కేసులు పెట్టకపోగా సైదులుపైనే కేసు పెట్టడం దారుణమన్నారు. అదే మండలంలో ప్రదీప్‌రెడ్డిపై సూర్యాపేట నుంచి వచ్చిన రౌడీలు చేసిన దాడి చేశారని, దసరా రోజున మండల కేంద్రంలోని ముగ్గురు యువకులపై 14 మంది నిర్ధాక్షిణ్యంగా చేసిన దాడిని పోలీసులు పట్టించుకోకపోగా బాధితులపై యువకులపైనే కేసు పెట్టారని తెలిపారు. కట్టంగూర్ మండలంలోని దుగినెల్లి, నకిరేకల్ మండలంలోని మంగళపల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులు రాత్రికి రాత్రే కూల్చి బొంద్రాయి పెట్టించారని మండిపడ్డారు. నకిరేకల్ మాజీ ఎంపీపీ మాధవరావుపై అకారణంగా దాడి చేయ డం, పామనుగుండ్ల మాజీ సర్పంచ్ సైదిరెడ్డిని విచక్షణా రహితంగా కొట్టడం వెనుక ఉన్నది కాంగ్రెస్ పార్టీలో ఉన్న రౌడీషీటర్లేనన్నది పోలీసులను తెలియదా అని ప్రశ్నించారు. కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారం మాజీ ఎంపీటీసీ రాములు ఇంట్లో దూరి, కండ్లల్లో కారం చల్లి అకారణంగా దాడి చేశారని, కడపర్తిలో గొర్ల భిక్షమయ్యకు చెందిన వ్యవసాయ బావి వద్ద పైపులను అదే గ్రామానికి చెందిన గన్‌మన్ పగులగొడితే ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. కేతెపల్లి ఎస్ఐ ఇటీవల కనీసం రెండు వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టాడని, ఈ విషయంపై ఎస్పీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు నియోజకవర్గంలో దోచుకోవడం, దాడులు చేయడం వంటివి చేస్తుంటే పోలీసులు వారికి అండగా ఉంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలను నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు రానిచ్చే పరిస్థితి లేదని, అసలు అది స్టేషన్‌నా, కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా అన్నది సీఐ రాజశేఖర్ చెప్పాలన్నారు. ఎమ్మెల్యేకు చెంచాగిరీ చేస్తున్న సీఐ పద్ధతి మార్చుకోవాలన్నారు. ఎస్పీ స్పందించి ఈ తొమ్మిది నెలల కాలంలో నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై నమోదైన కేసుల వివరాలను పరిశీలించి, సంబంధిత పోలీస్ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు దమనకాండను ఆపకపోతే బీఆర్ఎస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో పోలీసులు మేలు చేయకపోయినా ఫర్వాలేదు గానీ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టొద్దన్నారు. అక్కడ బీఆర్ఎస్‌ను నామరూపాల్లేకుండా చేద్దామనే కుట్ర మానుకోవాలని హితవు పలికారు. ప్రజల్లో కేసీఆర్‌పై ఉన్న నమ్మకం, బీఆర్ఎస్ పార్టీపై ఉన్న విశ్వాసం పోగొట్టడం ఎవరి తరమూ కాదన్నారు. పోలీసులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్న కార్యకర్తల్లా డ్యూటీ చేయడం మాని ప్రజల్లో విశ్వాసం పొందాలన్నారు. ఎస్పీ ప్రత్యేక చొరవ చూపి అక్రమ కేసులపై పరిశీలించాలని కోరారు.

# రాష్ట్రంలో ప్రజా వంచక పాలన

- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



రాజాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

రాజాపేట, అక్టోబర్ 18 : రాష్ట్రంలో ప్రజా పాలన కాదని, ప్రజా వంచక పాలన నడుస్తున్నదని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. వానకాలం పంట కోతకు వచ్చినా రైతుభరోసా అందించలేదన్నారు. రుణమాఫీ అమలులోనూ పూర్తిగా వైఫల్యమయ్యారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు చంద్రబాబుకు లాభం చేకూర్చేలా, పెట్టుబడులు అమరావతికి తరలిపోయేలా హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు చర్యలతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, నాయకులు గుంటి మధుసూదన్‌రెడ్డి, చింతలపూరి వెంకటరాంరెడ్డి, భాస్కర్‌గౌడ్, గుర్రం నరసింహులు, బొంగోని ఉప్పలయ్యగౌడ్, భోగ హరినాథ్, వెంకటేశ్‌గౌడ్, గుంటి కృష్ణ, తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి, నరేశ్‌రెడ్డి, గోపిరెడ్డి, ధర్మేందర్ సింగ్, రామిండ్ల నరేందర్, బెడిద వీరేశం, గణేష్, రమేశ్, రాజు పాల్గొన్నారు.